www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 17 జులై 2024
5
చిత్తూరు





పెద్దపంజాణి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

స్థిరమైన వృద్ధి సాధనకు కృషి చేద్దాం

బ్యాంకర్లకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈ ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకర్లు విరివిరిగా మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయంలో సమావేశపు మందిరంలో డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సాగుకు రైతులకు, కౌలు రైతులకు సాగుకు అవసరమైన ఆర్థిక సాయంను బ్యాంకర్లు అందజేయాలని, బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 5 లక్షల మంది రైతులు ఉన్నారని, రైతులు సాగుకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బ్యాంకర్లు చొరవ చూపి రుణాలను మంజూరు చేయాలన్నారు. దీంతో పాటు జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగమైన పశుసంవర్ధక శాఖ ద్వారా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వీరికి కూడా పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకర్ల భాగస్వామ్యంతో జిల్లాలో స్థిరమైన వృద్ధి సాధనకు కృషి చేద్దామని తెలిపారు. బ్యాంకర్ల సమావేశానికి విధిగా ప్రతిబ్యాంకు తరపున జెడ్ఎం, ఆర్ఎంలు తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ జిల్లాలో 28 పబ్లిక్, ప్రైవేట్, ఆర్ఆర్బి, కోఆపరేటివ్ బ్యాంకులు ఉన్నాయని, వీటికి సంబంధించి 274 బ్రాంచ్‌లు ఉన్నాయని, క్రెడిట్ డిపాజిట్ రేషియో 138 శాతం ఉన్నాయన్నారు. ప్రాధాన్యతా రంగానికి సంబంధించి అడ్వాన్స్‌ల కింద 2024 మార్చి 31నాటికి మొత్తం 67.17శాతం అందించారని ఇందులో వ్యవసాయ రంగానికి 53.51 శాతం ఇచ్చామన్నారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికాలో భాగంగా లక్ష్యానికి మించి 106.62 శాతం రుణాలను అందించామన్నారు. ఇందులో వ్యవసా య పంట రుణాలు, ఎంఎస్ఎంఈకి సంబంధించి లక్ష్యాలను సంతృప్తికర స్థాయిలో అందించామన్నారు. డిఆర్డిఏ, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలను మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్ డిడిఎం సునీల్, ఆర్‌బిఐ ఎల్‌బిఒ నాగ ప్రదీప్, ఇండియన్ బ్యాంక్ డిజెడ్ఎమ్ బాలచంద్ర మోహన్, డిఆర్డిఏ, మెప్మా పీడీలు తులసి, రాధమ్మ, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల అధికారులు మురళీకష్ణ, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.



మెరుగైన వైద్య సేవలు అందించండి..

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీలో కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మండలంలోని రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, వైద్య సిబ్బంది గ్రామాల్లో నిరంతరం పర్యటించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని వైద్యులకు సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామాల్లో పర్యటించి జ్వరాలతో బాధ పడుతున్న వారి వివరాలు సేకరించి వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామా ల్లో గ్రామ పంచాయతీ సర్పంచు లతో సమన్వయమై మంచి నీటి ట్యాంకుల క్లోరినేషన్, పారిశుధ్య చర్యలు వేగవంతం చేయాలని వైద్యాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి నందిని, ఎంపీహెచ్ఎస్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గణపతి, వైద్య సిబ్బంది పా ల్గొన్నారు.

గంగవరం : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి సుమిత్ కుమార్ మంగళవారం సందర్శించారు. వైద్య కేంద్రంలో మౌలిక వసతులు సిబ్బంది హాజరులపై ఆరా తీశారు. సకాలంలో వైద్యం అందించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులకు వేయాల్సిన టీకాలను సకాలంలో వేయలని ఔషధాలు సకాలంలో అందుతున్నాయా? అని ప్రశ్నించారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయా? అని ఆరా తీశారు వైద్య అధికారులు ఆసుపత్రి తో పాటు గ్రామాలలోనూ పర్యటించి సచివాలయ ఆరోగ్య మిత్రలను గ్రామాలలో స్థితిగతులను పసిగట్టాలని వారికి పలు సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాలకు వెళ్లి విద్యార్థులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఆహార నాణ్యత, మౌలిక సదుపాయాలు, బోధన సక్రమంగా వున్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

భారతదేశ వ్యవసాయం, సంప్రదాయం మార్గదర్శం

పర్యటనలో బెల్జియం విద్యార్థుల ప్రశంస

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : భారత దేశ జీవనశైలి, సంప్రదాయం ఎంతో భేష్ అని బెల్జియం విద్యార్థులు ప్రశం సించారు. భారతదేశ జీవన శైలి, సంప్రదాయాల అధ్య యనం కోసం ఎస్ఆర్‌పురం మండలానికి బెల్జియం విద్యార్థులు మంగళవారం వచ్చారు. వారిని 'ప్రజాశక్తి' పలకరించగా వారు చెప్పిన వివరాలు ఇలా...

తమిళనాడు తిరువళ్లూరు జిల్లా అతింజేరిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పల్లిపట్టు వ్యవసాయ శాఖలో ట్రైనర్ సిద్ధమ్మ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలోని కటిక పల్లి గ్రామ పంచాయతీ పిల్లి గుండ్లపల్లి ఎస్టి కాలనీకి సోమవారం చేరుకున్నామని, బెల్జి యంలోని బ్రస్సెస్ రాష్ట్రం నుండి విద్యార్థుల అధ్యయనం కోసం గ్రామీణ ప్రాంతంలో పర్యటిస్తున్నామన్నారు. ఎక్కువ భాగం ఎస్టీల జీవనశైలపైనే దృష్టి సారించామన్నారు. బెల్జియం నుంచి 24 మంది విద్యార్థులు వచ్చామని తెలిపారు. అందరూ ఇంటర్మీడియట్ చదువుతున్నవారే.. ఎస్ఆర్ పురం మండలం లోని పిల్లిగుండ్లపల్లి ఎస్టీ కాలనీలో మహిళలు, పురుషుల కష్టసుఖాలను వారితో పంచు కున్నారు. ఆ గ్రామంలో పిల్లలతో కలిసి ఆడుకున్నారు. వారిని ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించారు. వారి బాంధత్వాన్ని అడిగి తెలుసుకుని ఇలా అందరూ ఒకే చోట కలిసి జీవించడం ఒకరి ఇంట్లో ఉన్న ఆహారాన్ని మరొకరు పంచుకోవడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాలలో బంధుత్వం అంటే ఇలా ఉంటుందా..? ఇలా జీవించ వచ్చా..?' అని ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యామన్నారు. ఆహార అలవాట్లను రుచి చూసి ఔరా అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల కట్టుబొట్టు, పంచ కట్టు చీరకట్టు.. హిందూ సంప్రదాయం అంటే ఇంత గొప్పగా ఉంటుందా? అని ఒకరికి ఒకరు చర్చించుకున్నారు. భారతదేశ జీవనశైలి, సంప్రదాయాన్ని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ సిద్ధమ్మ పిల్లి గుండ్లపల్లి గ్రామస్తుల తెలుగు భాషను బిలిజియం విద్యార్థులకు ఫ్రెంచ్, ఇంగ్లీషు భాషలో అనువదించారు.

27మంది విద్యార్థుల బృందానికి పిల్లి గుండ్లపల్లి ఎస్టి కాలనీలో మండల స్థానిక రైతు, వాటర్ షెడ్ ఛైర్మన్ గుణశేఖర్ నాయుడు నేతృత్వంలో రైతులతో కలిసిపోయి ప్రకృతి నుంచి వచ్చే వివిధ రకాల మూలికల గురించి వివరాలు సేకరించారు. విద్యార్థులకు అల్పాహారం అందించి కొత్త రుచులను అందించారు. స్థానిక వంట కాలపై రుచి చూసి మెచ్చుకున్నారు. కొంత మంది విద్యార్థులు క్రికెటర్ రోహిత్ శర్మ జర్సీని ధరించి కెమెరాలకు పోజులిచ్చారు. మంగళవారం వారు కేరళకు తిరిగి వెళ్లారు.

జీవన వైవిధ్యం, సంప్రదాయం భేష్

భారతదేశ జీవనశైలి, సంప్రదాయా లు భేష్.. మా దేశంలోనూ ప్రకృతి వ్యవసాయం, ఆహార అలవాట్లు, బంధుత్వం ఒకటిగా కలిసి స్నేహ భావంతో జీవించడం లాంటి భారత దేశ సంస్కృతి ని మా దేశంలోనూ అలవాటు చేసుకుంటాం..

- బేస్ డెసిలియన్, బెల్జియం విద్యార్థి.

ఆహారం ఎంతో ఆరోగ్యకరం



భారతదేశంలో పండించే ఆహారం ఎంతో రుచిగా ఆరోగ్యకరంగా ఉం టుంది. ఈ ప్రకృతి వ్యవసాయం వ్యవస్థను మా దేశంలో నా పొలంలో నేను పండి స్తాను.. నలుగురికి ఆదర్శంగా నిలిచి వారిచే ప్రకృతి వ్యవసాయం చేయిస్తాను..

- లూయిస్, బెల్జియం విద్యార్థి.

యానాదుల అభివృద్ధికి సాయం

బెల్జియంతో 20 సంవత్సరాల అను బంధం వుంది. అక్కడ ప్రజలు ఇండి యా జీవనశైలిని ఎంతో ఇష్టపడతారు. యానా దులు అభివృద్ధి చెందాలని వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ప్రభుత్వం నుంచి చేర వల సిన పథకాలను వాళ్లకు తెలియజేస్తూ యానా దులలోనే 500 మంది నాయ కులను తయారు చేశాను. బెల్జియం వాళ్లకి సుఖమే తెలుసు కానీ కష్టాలు తెలియదు. వారికి కష్టాలు ఎలా ఉంటుందో తెలుసు కునే ప్రక్రియలో యానాదులు పూరి గుడిసెలలో, అడవి ప్రాంతాలలో ఎక్కువ జీవిస్తుంటారు. వారి జీవనశైలిని తెలుసుకోవడానికి వీరు ఎంతో ఇష్టపడతారు. ఇక్కడ తెలుసుకున్న వారి అనుభవాలను వారి కాలేజీలలో రిపోర్ట్ చేసి పబ్లిష్ చేస్తారు.

- సిద్ధమ్మ , సోషల్ వర్కర్, అతింజేరిపేట, తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.

గమ్యం చేరని గమనం..!

- రక్త మోడుతున్న రహదారులు
- ప్రమాదాల నివారణ చర్యలు పట్టని అధికారులు

ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న పరిజ్ఞానంతో పాటు ప్రమాదాల జోరూ పెరుగుతోంది. రోడ్డు ఎక్కిన ప్రయాణికులు తిరిగి ఇంటికి చేరే వరకు ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా పయనమైన కుటుంబీకులు ఇల్లు చేరే వరకు వారి బంధువులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకు రహదారుల దుస్థితి, పెరిగిన రవాణా సౌకర్యాలు, వాహన చోదకుల నిర్లక్ష్యాలు, అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడమే కారణంగా చెప్పుకోవచ్చు.


ప్రజాశక్తి-పూతలపట్టు: రహదారులు ప్రమాదాలతో రక్తమోడుతున్నాయి.. రోడ్డు పైకి వచ్చిన ప్రయాణికులు ఇల్లు చేరేవరకు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకోవలసిన పరిస్థితి.. వాహనాలతో రోడ్డుపైకి వస్తే ఎటువైపు నుంచి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందాల్సిన దుస్థితి. జాతీయ రహదారులపై మరింత పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పూతలపట్టు -నాయుడుపేట, చిత్తూరు- బెంగళూరు, చిత్తూరు-గుడియాత్తం మరికొన్ని జాతీయ రహదారులపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటుండగా.. మరికొందరు గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో నిత్యం నాలుగు నుంచి ఐదు రోడ్డు ప్రమాదాల కేసులు నమోదవుతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లోనే అత్యధికంగా ప్రాణాలు కోల్పోతున్నట్టు తెలుస్తోంది. అధిక వేగమే ఇందుకు కారణంగా అధికారులు పేర్కొంటున్నారు.

నెల రోజుల్లో 16 ప్రమాదాలు

గడిచిన జూన్ మాసంలో పోలీసుల సమాచారం మేరకు పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల పరిధిలో 16 ప్రమాదాలు సంభవించాయి. ఇందులో 12 మంది మృత్యువాత పడగా, మరో 20 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. బంగారుపాళ్యం, పూతలపట్టు మండలాల పరిధిలోని జాతీయ రహదారులపై అత్యధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని ప్రమాదాలకు పోలీసు స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు కావడం లేదు. అసలు పోలీసుల దృష్టికి కూడా రావడం లేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలోనే ఇరు గ్రూపులవారు రాజీ కుదుర్చుకొని వెళ్లిపోతున్నారు. వీటన్నింటినీ పోలీసుల ఖాతాల్లోకి చేరిస్తే ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



ఫైల్ ఫోటో



ఫైల్ ఫోటో

ప్రమాదాల నివారణకు చర్యలేవి..

సాధారణంగా ప్రతి మూడు మాసాలకు ఒకసారి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు విస్తృత స్థాయి చర్చలు నిర్వహి స్తుంటారు. ఇందులో భాగంగానే ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపడతారు. కానీ గత ఏడాది డిసెంబరులో అప్పటి పాలన అధికారి ఆధ్వర్యంలో ప్రమాదాలపై చర్చలు నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీస చర్చలు జరపడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..



జాతీయ రహదారిపై అప్పు డప్పుడు ప్రమాదాలు సంభవి స్తున్నాయి.. గతంలో పై అధి కారుల సూచనల మేర కు ప్రమాద కరమైన ప్రదేశాలను గుర్తించాం.. ఈ ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు భారీ గేట్లు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేశాము. హైవే మొబైల్ వాహనం ద్వారా ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

- సుదర్శన ప్రసాద్, పూతలపట్టు సిఐ.

మాజీ ముడా ఛైర్మన్, అనుచరులపై కేసు

ప్రజాశక్తి -పుంగనూరు: పీకేఎం ముడా ఛైర్మన్ నల్లబాల వెంకటరెడ్డి యాదవ్, ఆయన అనుచరులు నలుగురుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పుంగనూరు మండలం నడిమి గడిదేసి గ్రామానికి చెందిన లింగోళ్ల ముని రాజకుమారుడు లింగోళ్ల నవీన్ కుమార్ ఏప్రిల్ 15వ తేదీ ముడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఆయన అనుచరుల నలుగురిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకట్ రెడ్డి యాదవ్ ప్రోద్బలంతో ఆయన అనుచరులైన కొమ్మిరి వెంకటరమణ, బి రమేష్, ప్రవీణ్(చిన్నా), సాయి రెడ్డి వీరందరూ సెల్ ఫోన్ ద్వారా హేయమైన మాటలతో తనను తిట్టించారని పేర్కొన్నారు. '2024 సార్వత్రిక ఎన్నికలలో టిడిపికి మద్దతు ఇస్తూ ప్రచారం చేస్తే నిన్ను చంపేస్తాం!' అంటూ బెదిరించారని తెలిపారు. 'ఎన్నికలు అయ్యే వరకు ఇల్లు వదిలి బయటకు నువ్వు వస్తే నిన్ను బతకనివ్వం.. చంపేస్తాం..!' అంటూ బెదిరించారని తెలిపారు. తమ ఇంటి పై దాడి చేస్తామని, భార్యా బిడ్డలు, తల్లిదండ్రులకు ప్రాణహాని కలిగించే విధంగా మాట్లాడారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేయాలని లింగోల నవీన్ యాదవ్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసును పరిశీలించి వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

60 కేజీలు గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- పుంగనూరు: అక్రమంగా నిల్వ ఉంచిన భారీగా గంజాయిని స్వాధీనం చేసుకొని ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పలమనేరు డిఎస్పి విష్ణు రఘువీర్ తెలిపారు. స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ కథనం మేరకు...పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేర పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అగ్నిమాపక శాఖ కార్యాలయం వెనుక ఉన్న ఇంటిలో గంజాయి నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో ఎస్సై జయరామయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అనుమానిత ఇంటిలో తనిఖీలు చేయగా 29 గంజాయి ప్యాకెట్లు, 59.470 కేజీలు, నాలుగు బ్యాగులులో నిల్వచేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క కిలో గంజాయి విలువ పదివేల రూపాయలు. తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి విలువ మొత్తం రూ 5,94,700లు చేస్తుందని తెలిపారు. దీంతోపాటు నిందితులైన విజయవాడ సిటీకి చెందిన బి.ఆదినారాయణ కుమారుడు బొడ్డేటి శివ నాగేశ్వరరావు (25) కూలిపని చేస్తున్నాడు. పట్టణంలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన ఆవుల లక్ష్మన్న కుమారుడు ఆవుల రవి(27) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కానహర్(24), జి.గిరి (37) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పలమనేరు టౌన్‌కు చెందిన జి.నవీన్ (25), భగత్ సింగ్ కాలనీ చెందిన ఆటో డ్రైవర్ నవీద్ అహ్మద్ (40)లను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది రెడ్డప్ప, ఎల్లప్ప, చిన్నరెడ్డప్ప, ప్రకాష్, రమణ, ఎస్సై జయచంద్ర, హెడ్ కానిస్టేబుల్ ఢిల్లీ కుమార్‌లు పాల్గొన్నారు.



పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

చినుకు పడితే చిత్తడే..!

అధికారులూ పట్టించుకోండయ్యా..!



ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఏళ్ల తరబడి రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం, ఇటీవల కురిసిన వానలకు మండల, గ్రామ రహ దారులైతే మరీ అధ్వానంగా తయా రయ్యాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.. రాత్రివేళల్లో సరిగా కనిపించక గుంతల్లోపడి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పలుచోట్ల ద్విచక్రవాహనంపైనే కాదు.. కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదు.

మండలంలోని బ్రాహ్మణపల్లె నుంచి రామచంద్రాపురం మండలం అన్నుప్పల్లి వరకు వెళ్లే దారి గుంతలుపడి ప్రయాణించడానికి వీలులేకుండా తయారైంది. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు చేరి బురదతో ఎక్కడ గుంతలున్నాయో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలీని పరిస్థితి. దీంతో పలువురు వాహనదారులు గుంతలో పడి గాయాలైన సంఘటనలూ లేకపోలేదు.. వాహనాల్లో ప్రయాణం సరికదా.. కనీసం నడవడానికి కూడా ఈ రోడ్లు ఇబ్బందిగా ఉంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. అలాగే బ్రాహ్మణపల్లె నుంచి కురివికుప్పం గ్రామానికి వెళ్లే రోడ్డు కోతలకు గురైంది. నల్లవెంగనపల్లి జాతీయ రహదారి నుంచి కలిమిచేను గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు అయితే మరీ అధ్వానంగా తయారైంది. కనీసం గ్రామస్తులు నడిచివెళ్లే పరిస్థితి కూడా లేదు. పచ్చికాపల్లం జాతీయ రహదారి నుంచి కొమరగుంట ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో అడుగుపెట్టలేని దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా మండలంలోని బాలుపల్లి, అల్లంవారి కండ్రిగ, చింతలగుంట, వెదురుకుప్పం ఎస్సీ కాలనీ వేపేరి గ్రామాల మీదుగా వెళ్లే రోడ్డులన్నీ మరమ్మతులకు గురై అధ్వానంగా ఉన్నాయి. తారుపోయి కంకర తేలి కొన్ని రోడ్లు అధ్వానంగా ఉంటే మరికొన్ని రోడ్డు వర్షాలకు మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి ప్రయాణమే నరకప్రాయంగా తయారయ్యాయి. ఇకనైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసి గ్రామస్తుల సమస్యలు తీర్చాలని వారు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోండయ్యా..



ప్రస్తుతం కురుస్తున్న వానలకు రోడ్డుపై నీళ్లు నిలిచి ఎక్కడ చూసినా గుంతలలో నీరు చేరి ప్రయాణించాలంటే ఎక్కడ గుంత ఉందో తెలీక ప్రజలు భయ పడుతున్నారు. ఈ రోడ్డుపై స్థానికులు ప్రయాణం సాగించాలంటే ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇక నడిచి వెళ్లాలంటే అసలు వీలు కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్లపై ఏర్పడిన గుంతలో మట్టి రోడ్డుపై ఏర్పడిన కోతకు గురైన రోడ్లను బాగు చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కేనో?

- ఆశావహుల ఎదురుచూపు
- పలువురి పోటీపడే అవకాశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో భారీ మెజార్టీతో 163 అసెంబ్లీ స్థానాలు సాధించి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడంతో నామినేటెడ్ పదవులపై టిడిపి, జనసేన, బిజెపి నేతలు పావులు కదుపుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన నేతలు, అసెంబ్లీ టికెట్లు ఆశించి భంగపడ్డ నాయకులు తమకే నామినేటెడ్ పదవులు ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారు. పార్టీ విజయం కోసం కష్టపడ్డ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ కష్ట కాలంలో పార్టీ కోసం నిలబడ్డ తమను గుర్తించాలంటూ పలువురు టిడిపి నేతలు అధిష్టానం పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బిజెపిలకు చెందిన నేతలు కూడా నామినేటెడ్ పదవుల కోసం పట్టుబట్టుతున్నారు. ముఖ్యంగా జనసేన జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు మనవరాలు డీకే చైతన్య బహిరంగంగానే తుడా, చూడ ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రకటించారు. తనను తుడా ఛైర్మన్‌గా నియమించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సాను కూలంగా ఉన్నట్లు ప్రకటించారు. అదే తరహాలో బిజెపి ముఖ్య నాయకులు జిల్లాలోని ఆలయ కమిటీ ఛైర్మన్ కమిటీ పదవులను ఆశిస్తూ బిజెపి అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

అసెంబ్లీ స్థానం కోసం పోటీ పడ్డ నాయకుల నిరీక్షణ

మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఖజూరు బాలాజీ, గీర్వాణి చంద్రప్రకాష్, సి ఆర్ రాజన్ చివరి నిమిషంలో చిత్తూరు ఎమ్మెల్యే స్థానం గురజాల జగన్మోహన్ ను వరించడంతో పార్టీ విజయం కోసం పనిచేశారు. ఎమ్మెల్యే టికెట్ దక్కకపోయినా పార్టీ విజయం కోసం పనిచేసిన నేతలు అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని టిడిపి అధి నాయకత్వం ప్రకటించింది. ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ కటారి హేమలత, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ చంద్రప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఖజూరు బాలాజీ, సి.ఆర్ రాజన్ నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నాటి అధికార పార్టీ వైసిపి ఘోర ఓటమితో 14 సీట్లకే పరిమితం కావడంతో ఆ పార్టీ నుండి స్థానిక సంస్థల్లో విజయం సాధించిన నాయకులు టిడిపిలోకి భారీగా వలసలు వస్తున్నారు. ఇలా టిడిపి కండువా కప్పు కుంటున్న నేతలు నామినేటెడ్ పదవులకు పోటీ అయ్యే అవకాశం ఉందని టిడిపిలో చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా కూటమి నాయకుల మధ్య నామినేటెడ్ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఆయా పార్టీలకు చెందిన నేతలు తాము పార్టీ కోసం కష్టపడ్డామంటూ నామినేటెడ్ పదవులు తమకే ఇవ్వాలని పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు కూటమి ప్రభుత్వానికి తలనొప్పిగా మారనున్నట్లు సమాచారం.

18న కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈనెల 18వ తేదీ గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మైనర్లు వాహనాలు నడిపితే జరిమానా


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమణారావు

ప్రజాశక్తి- పూతలపట్టు: మైనర్లు వాహనాలు నడిపితే రూ. 10 వేలు జరిమానా విధించనున్నట్లు పూతలపట్టు ఎస్ఐ రమణారావు హెచ్చరించారు. మంగళవారం ముగ్గురు మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళుతుండగా పట్టుకున్నారు. సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. 'అభం శుభం తెలియని పిల్లలు రోడ్డు పైకి వస్తుంటే మీరు ఏం చేస్తున్నారు? ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలాగ? ఇకపై ఇలాంటి పొరపాటు జరిగితే వాహనాలను సీజ్ చేస్తాం..!' అని హెచ్చరించారు. అనంతరం మైనర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి అమ్మ వారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కె ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కుటుంబ ఆర్థిక అభివృద్ధి కోసం మహిళలలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని పుంగనూరు సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ రాధారాణి అన్నారు. మంగళవారం స్థానిక సహకార కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత మ్యాజిక్ షో ద్వారా పాటలు, మాటలు ద్వారా మహిళలకు అర్థం అయ్యే రీతిలో ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు వ్యవసాయ, బంగారంపై రుణాలను, తక్కువ వడ్డీతో రుణాల అందిస్తున్నామని, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన , సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ లావాదేవీల,సైబర్ క్రైమ్ మోసాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరివాణి, రోహిత్, సిఈఓ చంద్రశేఖర్, అక్రమ్‌బాష, గ్రామ ప్రజలు, బ్యాంకు సిబ్బంది, కళాజాత బృందం సభ్యులు మేజీషియన్ విజయ్, డప్పు చిరంజీవి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రైడే డ్రైడేగా పాటిద్దాం..


విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - సదుం : దోమలు అభివృద్ధి కాకుండా వుండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ప్రైడే ను డ్రైడే గా పాటిద్దామని డాక్టర్ చరణ్ అన్నారు. చెరుకు వారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో మంగళవారం చెరుకు వారిపల్లిలో, సదుం ప్రభుత్వ ఎస్సి బాలుర వసతి గృహంలో ఆయన దోమల నివారణపై అవగాహన కల్పించారు. చెరుకువారిపల్లి ఏరియా లోని మురికి గుంట లలో దోమలు అభివృద్ధి చెందకుండా గంబుషియా చేప పిల్లలను వదిలారు. సదుం ప్రభుత్వ ఎస్సి బాలుర వసతి గృహంలో పిల్లలకు పరిశుభ్రతపైన అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శ్రావణి, రషీద్ ఆరోగ్య కార్యకర్తలు రేవతి, సర్తాజ్ ఆశా కార్యకర్తలు పా ల్గొన్నారు.

జాబ్ మేళాలో 28 మంది ఎంపిక

ప్రజాశక్తి-నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఆర్ఎఫ్ కంపెనీ ట్రైనీల కోసం మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. 31 మంది జాబ్ మేళాకు హాజరు కాగా వారికి కంపెనీ ప్రతినిధులైన హెచ్ఆర్, ప్రొడక్షన్ మేనేజర్లు, కణ్ణన్, సెల్వకుమార్, పాల్, వెంకటరామన్, డేవిడ్ రాతపరీక్ష, ముఖాముఖి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 28 మందిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన వారికి మొదటి సంవత్సరం రూ. 19,500, రెండవ సంవత్సరం రూ.20,500, మూడవ సంవత్సరం రూ. 21,500 ఇతర భత్యాలు చెల్లిస్తారన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం జీతం ఎంత అని ఆలోచించక వచ్చిన ఉద్యోగాన్ని జ్ఞానాన్ని, నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి అవకాశంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కర రాజు, జేకేసీ ఇన్‌ఛార్జ్ కోఆర్డినేటర్ డా.రేవతి, మెంటార్ లాల్ బాషా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'మెడికల్ బిల్లుల మంజూరులో జాప్యం నివారించండి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యాన్ని నివారించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, బోడే మోహన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఎస్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ ఎస్టీయు జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు తో కలిసి చిత్తూరులో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ కు వినతి పత్రాన్ని సమర్పించి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చికిత్స పొంది, మెడికల్ బిల్లుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే చిన్న చిన్న కారణాలతో బిల్లులు కొర్రీలు వేస్తున్నారని, అనవసర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ తప్పని సరిగా ఈ అంశాలపై తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మెడికల్ బిల్లుల మంజూరుకు సంబంధించిన సమగ్ర సమాచారం తెప్పించుకుని సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.


వైభవంగా ఆణివారి ఆస్థానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆణివారి ఆస్థానం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే శుద్ధి తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణంలో కొలువు దీర్చారు. వేదపండితులు వేద మంత్రాలతో ఆణివారి ఆస్థానాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాలాచారి పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని దలవాయి కొత్తపల్లి ప్రాంతంలో కుప్పం డంపింగ్ యార్డ్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ మద్యంను గుడుపల్లి పోలీసులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గుడుపల్లి ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలపరిధిలో అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ కర్ణాటక మద్యంను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, జిల్లా ఎస్ఈబి సూపరింటెండెంట్ శ్రీధర్, కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ల సమక్షంలో 1554 లీటర్ల మద్యం ధ్వంసం చేసినట్టు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4,80,000లు ఉంటుందన్నారు.

టిడిపి నేతలను పరామర్శించిన ఎమ్మెల్సీ



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు సర్దార్ బాషను మంగళవారం టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నియోజకవర్గ ఇన్చార్జి పిఎస్ మునిరత్నంతో కలిసి పరామర్శించారు. గత కొద్ది రోజులుగా ముందు సర్దార్ బాష కంటి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కుప్పం మున్సిపాలిటీ అధ్యక్షులు రాజకుమార్, మాజీ ఎంపిపి ట్రైసన్ సతీశ్ శేఖర్, మైనార్టీ నేతలు జాకీర్, అన్వర్, మాజీ సర్పంచ్ మణి ఉన్నారు.

లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగండి

విద్యార్థులకు డిఎస్పి ఉద్బోధ

ప్రజాశక్తి- వికోట : విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకెళ్లేందుకు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకునేందును నిజాయతీగా ప్రయత్నించాలని పలమనేరు డిఎస్పి విష్ణు రఘువీర్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రమైన వికోటలోని పీఎంఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం విద్యార్థులకు చట్టాలు, సమాజం పట్ల అవగాహన, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా విద్యార్థులకు డిఎస్పి పలు సూచనలు, సలహాలు అందించారు. వికోటలోని పీఎంఆర్ కళ్యాణ మండపంలో విద్యార్థులకు పోలీసులు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు డిఎస్పి విష్ణు రఘువీర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చెడు తోవ పడుతున్న యువతను సన్మార్గంలో నడపడమే కాకుండా సైబర్ నేరస్తుల దగ్గర ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? రోడ్ ట్రాఫిక్ నియంత్రణ, మహిళలకు వ్యతిరేకంగా నేరాలు, చిన్నపిల్లల రక్షణ, ఫోక్సో యాక్ట్, మానవ అక్రమ రవాణా, రోడ్ యాక్సిడెంట్లు, సైబర్ క్రైమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న యువతను ఎలా మంచి మార్గంలో ఎలా నడిపించాలి? అనే అంశాలపై ప్రసంగించారు. ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులకు మొబైల్స్ ద్వారా వచ్చే నష్టాలను తెలిపారు. సైబర్ నేరగాళ్ల నుంచి దూరంగా ఉండాలని జల్సాలకు అలవాటు పడి చిన్న వయసులోనే నేరాలకు పాల్పడుతున్న యువత సన్మార్గాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పదో తరగతి పాస్ అయితే విద్యార్థులకు బైకులు కొనిపెట్టి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులను హెచ్చరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ లో సైబర్ నేరగాళ్లు అమ్మాయిలు ఫొటోలను మార్ఫింగ్ చేసి వాళ్ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని దయచేసి విద్యార్థులు అలాంటి వాటికి దూరంగా ఉండాలని డిఎస్పి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ లింగప్ప, ఎస్ఐ బాబు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పెద్ద ఎత్తున విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలమనేరు డిఎస్పి విష్ణు రఘువీర్

చట్టాలపై అవగాహన అవసరం: ఎఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:"సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను నిరోధించడానికి అవగాహన ముఖ్యమైన జిల్లా అడిషనల్ ఎస్పి సుబ్బరాజు అన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు మంగళవారం అడిషనల్ ఎస్పి 'మహిళలపై అన్యాయాలు, నివారణ చట్టాలపై సావిత్రమ్మమహిళా డిగ్రీ కాలేజీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మహిళా విద్యార్థులకు చట్టాల గురించి తెలిపారు. వారి హక్కులను రక్షించుకోవడం, సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. మహిళలకు రక్షణ చర్యలలో భాగంగా పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు శాఖ ఎంత సత్వరం స్పందిస్తుందో వివరించారు. భారత రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులు, మహిళల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు మరియు వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకునే విధానాలు గురించి అవగాహన పెంపొందించడానికి ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు అనేవి లైంగిక వేధింపులు, గృహ హింస, లైంగిక దాడి, అసభ్యకర ప్రవర్తన వంటి అనేక రూపాలలో ఉండవచ్చు అని వివరించారు. ఈ అఘాయిత్యాలను నిరోధించడానికి భారత ప్రభుత్వంచే అమలు చేయబడుతున్న పాక్షిక చట్టాల గురించి వివరించారు. ముఖ్యంగా, 2013 నాటి క్రిమినల్ లా (సవరణ) చట్టం, 2005 నాటి గృహ హింస నిరోధక చట్టం, మరియు 2012 నాటి పాక్సో చట్టం వంటి వివిధ చట్టాల గురించి విశ్లేషించారు. ప్రతి మహిళా తన హక్కులను తెలుసుకొని, అన్యాయాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రోత్సహించారు. మహిళల రక్షణ కోసం ఈ చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించడానికి ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తీసుకురావాలని ప్రతిజ్ఞ చేశారు.

గొడుగుల వితరణ

ప్రజాశక్తి - తవణంపల్లి: మండలంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్ రెడ్డి ప్రతి సంవత్సరం పేద ప్రజలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం తవణంపల్లి మండలం అరగొండ మేజర్ గ్రామపంచాయతీలో నివసిస్తున్న 500 కుటుంబాలకు వర్షాకాలం సందర్భంగా ప్రజలు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని ప్రజల కోసం తన సొంత నిధులతో ఉచితంగా గొడుగులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైమాఘం సుగుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసితన వంతు సహాయంగా ప్రజలకు గొడుగులు వితరణ చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరగొండ పంచాయతీ సర్పంచ్ టీ మల్లు దొరై, పైమాఘం ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా వుండాలి: సర్పంచ్



ప్రజాశక్తి-పెద్దపంజాణి: జ్వరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బసవరాజు కండ్రిగలో ఇటీవల భావన అనే చిన్నారికి డెంగీ రావడంతో వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య చర్యలు, మంచినీటి ట్యాంకుల శుభ్రత ఎప్పటికప్పుడు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చేయిస్తున్నారు. కానీ బసవరాజుకండ్రిగలో మరికొంత మంది ఇంకా జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నందిని పర్యవేక్షణలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. బిపి షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి వారికి వైద్య శిబిరం ద్వారా వైద్య చికిత్సలు అందేలా చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నందిని మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంచినీటి ట్యాంకులోని నీటిని పరీక్ష చేయడానికి శాంపుల్స్ కూడా తీసుకున్నారు. బసవరాజు కండ్రిగలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించినందుకు సర్పంచ్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, ఎంఆర్సీ సుధాకర్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ, పీహెచ్ఎన్ శమంతకమణి, ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు, ఎంపీహెచ్ ఎస్ రాధాకృష్ణ, ఎంఎల్ హెచ్ పీలు వరలక్ష్మి, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త సునీత, ఆశాలు లలిత, నాగేశ్వరి, బాగవతి, సుబ్బమ్మ, జ్యోతమ్మ, భారతి పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు మొహరం శుభాకాంక్షలు: ఎంపీ



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: త్యాగానికి ప్రతీక మొహరం పండుగ అన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మొహరం పర్వదినం నేపథ్యంలో ప్రసాదరావు మహమ్మదీయ సోదరులకు మొహరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మొహర్రం పండుగ త్యాగం, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. విశ్వాసం, నమ్మకం కోసం మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవడమే మొహర్రం ప్రత్యేకత అని వివరించారు.మానవజాతిలో త్యాగం ఎంతో గొప్పదని, మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవడమే ఈ వేడుకకు నిజమైన అర్థమని అన్నారు. ఇస్లాంలో ముఖ్యమైన మానవతా వాదాన్ని ప్రతిబింబించే మొహర్రం స్ఫూర్తిని అనుకరిద్దామని సూచించారు. త్యాగం, శాంతి, న్యాయం వంటి ఆదర్శాలు మనలో ఎప్పటికీ స్ఫూర్తి నింపు తాయని తెలిపారు. అదే స్ఫూర్తితో దగాపడ్డ ఆంధ్ర రాష్ట్రాకి తిరిగి మళ్లీ చంద్రబాబు నేతృత్వంలో మళ్లీ అభివృద్ధి పథంలో నడుస్తుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

చిత్తూరు నియోజకవర్గం ముస్లిం సోదర సోదరీమణులకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. మొహర్రం పండుగ త్యాగం, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. విశ్వాసం, నమ్మకం కోసం మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవడమే మొహర్రం ప్రత్యేకత అని వివరించారు

బెల్జియం విద్యార్థులకు భారతీయ భోజనం

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : బెల్జియం దేశానికి చెందిన 27 మంది విద్యార్థుల బృందంకు ఎస్ఆర్‌పురం మండలం కటిక పల్లె చెందిన మాజీ వాటర్ హెడ్ ఛైర్మన్ రైతు నాయకుడు గుణశేఖర్ నాయుడు మంగళవారం భారతీయ భోజనం పరిచయం చేశాడు. వీరికి ఇడ్లీ, సాంబారు, వడ, పచ్చడి, లాంటి వాటిని స్వయంగా వడ్డించి వాటి గురించి వివరించారు. దీన్ని వారు ఆనందంగా అల్పాహారం ముగించారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా ఉపయోగించే సంగటి, నాటుకోడి, గోగాకు పచ్చడి, వేరుశనగ పచ్చడి, ఇలాంటి పురాతన వంటకాలు భారతీయ సంప్రదాయాలను వివరించారు. వారికి సజ్జ, జొన్న రొట్టెలు, ప్రకృతిలో లభించే ఆకుకూరలు గడ్డలు వాటిని గురించి వాటితో ఆరోగ్యం గురించి, సమాజ జీవనం, గ్రామాలు పంచాయతీలు, ఉమ్మడి కుటుంబాలు, గురించి వారికి తెలిపారు. బెల్జియం దేశానికి చెందిన విద్యార్థుల బృందం 27 మంది మండలం లోని పిల్లి గుండ్లపల్లి ఎస్టి కాలనీ జీవన వైవిధ్యం పై పరిశోధన భారతదేశంలో గ్రామీణ జీవనం, తీరుతెన్నుల పరిశీలన కోసం మండలానికి వచ్చారు. పిల్లి గుండ్ల పల్లి ఎస్టి కాలనీలో రైతులతో కలిసిపోయి ప్రకృతి నుంచే వివిధ రకాల మూలికల గురించి వివరాలు సేకరించారు. ఎస్టీలు తీసుకునే ఆహారాలు సహజంగా అడవిలో లభించే మూలికలు, మాంసాహారాలు లాంటి వాటి గురించి కూడా ఉత్సాహంగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిలిగుండ్లపల్లి ఎస్టీ కాలనీ వాసులు, రైతు నాయకుడు గుణశేఖర్ నాయుడు, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


బెల్జియం విద్యార్థులతో రైతు నాయకుడు గుణశేఖర్ నాయుడు

విద్యార్థినికి కలెక్టర్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు సంతపేట బండ్ల వీధికి చెందిన ఆరవ తరగతి చదువుతున్న హెచ్ టింపుల్‌కు కలెక్టర్ సుమిత్ కుమార్ రూ.25 వేలు ఆర్థిక సాయం మంగళవారం జిల్లా సచి వాలయం లోని కలెక్టర్ ఛాంబర్‌లో అందించారు. చిత్తూరు సంతపేట బండ్ల వీధికి చెందిన హరి కుమార్ కుమార్తె హెచ్ టింపుల్ జులై 1 వ తేదీన జిల్లా సచివాల యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలసి తనకు తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారని, ప్రస్తుతం పెద్దమ్మ జయలక్ష్మీ సంరక్షణలోఉన్నానని , వారే తన చదువు, వైద్య ఖర్చులు చూస్తున్నారని, వారు జీవనం సాగించడానికి కష్ట తరంగా వుందని తమను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం సాయంత్రం హెచ్ టింపుల్ కు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద రూ.25 వేలు ఆర్థిక సాయం మంజూరు చెక్కు ను టింపుల్ పెద్దమ్మ, సంరక్షకురాలు జయలక్ష్మి కి అందించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి, టింపుల్ కలెక్టర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సీపీఓ సాంబశివరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఫిర్యాదులు పరిష్కరించండి: జేసీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెల 25,26 తేదీ లలో కుప్పం పర్యటన సందర్భంగా నిర్వహించిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా ప్రజలు రెవెన్యూ కు సంబంధించి సమస్యల పరిష్కరించాలని ముఖ్యమంత్రికి అందజేసిన ఫిర్యాదులను గురువారం నాటి కల్లా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ క్యాంపు ఆఫీసు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన సమస్యల అర్జీలు, రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీలు, ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిన అర్జీలు, ఏ పి సేవా సర్వీసులు వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్ డి ఓ లు, తహశీల్దార్లు తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు గత నెల 25,26 తేదీ లలో కుప్పం పర్యటన సందర్భంగా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కరం లో బాగంగా ప్రజలు రెవిన్యూ మరియు వివిధ రకాల కు సంబంధించి సమస్యల పరిష్కరించాలని ముఖ్యమంత్రి కి అందజేసిన ఫిర్యాదుల ను గురువారం నాటి కల్లా పరిష్కరించాలని సంబందితా ఆర్ డి ఒలను, తహశీల్దార్లను ఆదేశించారు. 2024 జూన్ 18 నుండి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన అర్జీలను శాఖల వారీగా పంపడం జరిగిందని,ప్రతి శాఖ అధికారి రెండు గంటలకు ఒకసారి శాఖాపరంగా మెయిల్స్ ను పరిశీలించుకోవలని వారికి సంబంధించిన ఫిర్యాదుల ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి క్షేత్ర స్థాయిలో తహశీల్దార్లు, మండల సర్వేయర్లు,వి ఆర్ ఓ లు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం పై ఆర్ డి ఓ లు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి కొరకు అందిన ఫిర్యాదులను పరిష్కరించగలిగే వాటిని పరిష్కరించి, పరిష్కరించలేని వాటికి సంబంధించి నివేదికను జెసి కి అందజేయాలని సంబంధిత ఆర్ డి ఓ ల ను సంబంధిత నివేదికను వెబ్ సైటులో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.

మురుగునీటి కాలువలు శుభ్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- సోమల:

సోమల మండలం పెద్దఉప్పరపల్లి గ్రామంలోని పెద్ద మసీదు వీధిలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఈనెల 3వ తేదీ కురిసిన వర్షానికి మురుగునీరు వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహించింది. దీనిపై ప్రజాశక్తి ఈనెల 4వ తేదీ చినుకుపడితే రోడ్లపైనే మురుగు అనే వార్త ప్రచురించడంతో స్పందించిన పంచాయతీ సిబ్బంది మంగళవారం గ్రామంలోని మురుగునీటి కాలువలలోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు. దీంతో మురుగునీటి కాలువలు శుభ్రం కావడం వల్ల తమకు దుర్గంధం బెడద తప్పిందని గ్రామస్తులు, ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.


మురుగునీటి కాలువలు శుభ్రం చేసిన దృశ్యం

లెప్రసీ క్యాంపెయిన్‌పై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 18వ తేదీ నుండి నిర్వహించనున్న లెప్రసీ గుర్తింపు సర్వేపై ఒకరోజు శిక్షణను చిత్తూరు జిల్లాలోని వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి, ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుండి ఆగస్ట్ 2వ తేదీ వరకు ఇంటింటి కుష్టు వ్యాధి సర్వే ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు నిర్వహిస్తారని తెలిపారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగులో ఉండే మచ్చ పై భాగంలో వెంట్రుకలు, నొప్పి లేకుండా వుండడం, మిన, మిన మని మెరిసే మచ్చలను శరీరంలో ఏ భాగంలోనైనా ఉండవ చ్చన్నారు. ఒక మచ్చ నుండి ఐదు మచ్చలు లోపు ఉంటే మల్టీ బాసిల్లయి అంటారని, ఆరు నెలల చికిత్స అందిస్తారని, ఒకవేళ ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే మల్టీ బాసిల్లయి అనీ అంటారన్నారు. ఇందుకు ఒక సంవత్సరం పాటు మందులు క్రమం తప్పకుండా తినాలని, కుష్టు వ్యాధికి చికిత్స పూర్తిగా ఉచితంగా అందిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి సర్వేలో ఆశా కార్యకర్తలు, శిక్షణ పొందిన పురుష వాలంటీరు ఒక టీమ్‌గా వెళ్లి సర్వే చేస్తారని సర్వేకు ప్రజలు సహకరించాలని తెలిపారు. అనంతరం సర్వేకు సంబంధించిన ఫార్మాట్స్, డైలీ పంపవలసిన రిపోర్ట్స్ గురించి ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టిఓటి సతీష్, డిఐఓ డాక్టర్ అనిల్, డాక్టర్ సాయి షర్మిల, డిపిఎంఓ రవికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌లో వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారిణి దుర్గాదేవి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ఉన్న బాలుర, బాలికల వసతి గృహంలో గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాదేవి వైద్య పరీక్షలు నిర్వహించామని మంగళ వారం మీడియాకు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు జిల్లాలో విస్తారంగా పడుతున్న నేపథ్యం లో ముందు వసతి గృహంలో ఉన్న బాలుర, బాలికలకు ఎలాంటి ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎవరికీ ఆరోగ్యపరమైన సమస్యలు లేవని ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్‌డబ్ల్యూ షకీలా, హాస్టల్ వార్డెన్లు శాంత రాజ్, రమాదేవి, సిహెచ్ఓ శ్రీనివాసులు, ఎంఎల్ హెచ్‌పి దీప్తి, ఆశ వర్కర్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మెరుగైన విద్యా బోధన అందిస్తున్నామని బిజెపి పలమనేరు అసెంబ్లీ కో కన్వీనర్ అన్నారు. మండలంలోని శంకర్రాయలపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అంది స్తున్న విద్యా కానుక కిట్లు పంపిణీలో స్థానిక సర్పంచ్ హరినాథ్ తో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి పేద విద్యార్థికి ప్రభుత్వం ప్రోత్సాహకరంగా విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల వారి పిల్లలను చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదవతి, బిజెపి కూటమి సభ్యులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి సహకరించండి

మంత్రికి బీసీ సెల్ మండల నాయకుల వినతి


మంత్రి కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న బిసిసెల్ నాయకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: బిసిల అభివృద్ధికి సహకరించాలని మంత్రి కొల్లు రవీంద్రకు మండల సిసి సెల్ నాయకులు విజ్ఞప్తి చేశారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్ మంగళవారం టిడిపి నాయ కులతో కలిసి విజయవాడ లోని రాష్ట్ర గనులు, ఎక్సైజు శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనను శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో నరసింహు లు, ముద్దుకృష్ణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

ప్రజాశక్తి -నగరి : మొక్కల పెంపకం అందరి బాధ్యత అని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏజీఎం కిషోర్ అన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణ పరిధిలో ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి అందరికీ మొక్కలు అందించారు. అనంతరం పట్టణ పరిధిలో మొక్కల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పూల మొక్కలు, చెట్ల అలంకరణతో పాల్గొనడం అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కార్తిక్, ఆర్ఐ కిరణ్, కోఆర్డినేటర్ దాక్షాయణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఆఫీసర్లకు ఎన్నికల భత్యం చెల్లించాలి

ఏపీఎన్జీజీఓ సంఘం వినతి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారీ కోసం కీలక విధులు నిర్వహించిన బూత్ లెవల్ అధికారులకు గత రెండు సంవత్సరాలుగా ఎన్నికల భత్యం చెల్లించలేదని, ఎన్నికల విధులు నిర్వహించిన భత్యం కూడా ఇప్పటికీ 3నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని పలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారి మనోజ్ రెడ్డికి ఏపీఎన్జీజీఓ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీజీఓ సంఘం అధ్యక్షుడు కె.ఆనందబాబు మాట్లాడుతూ బూత్‌లెవల్ అధికారులు, ఏఎన్ఎం, ఆశా ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల వివిధ హోదాల సిబ్బందికి చెల్లించాల్సిన ఎన్నికల భత్యాలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎన్నికల నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు, విడుదలైన వెంటనే మంజూరు చేయనున్నట్లు ఆర్డీఓ నాయకులను తెలిపారు. గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరి, సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, గంగవరం దామోదర్ నాయుడు, వికోట వెంకటా చలపతి నాయక్ పాల్గొన్నారు.

మూల విరాట్‌కు నూతన కిరీట ధారణ

ప్రజాశక్తి- సోమల:

సోమల మండలం 81 చిన్నఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం మూల విరాట్‌కు నూతన కిరీటం ధరింప చేసే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉభయ దాతలు ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పౌరోహితులు నూతన కిరీటాన్ని అమర్చారు. ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా 'మొహరం' వేడుకలు

ప్రజాశక్తి- సోమల:

మండలంలోని ఆవుల పల్లె గ్రామంలో ముస్లిం సోదరులు హిందువులు కలిసి మొహరం పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గంగమ్మ గుడి సమీపంలో చలువ పందిళ్ళు వేసి పీర్లను ప్రతిష్టింపజేసి విద్యుత్ దీపాలను పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి పీర్లను గ్రామంలో ఊరేగించి బుధవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా మొహరం పండుగలు గ్రామంలోని హిందువులు కూడా పాల్గొని ముస్లిం సోదరులకు సహాయ సహకారాలు అందించడం విశేషం. పెద్ద ఉప్పరపల్లి గ్రామంలో పీర్ల చావిడి వద్ద దాదాపు 50 పీర్లను ఏర్పాటు చేసి అందంగా అలంకరించి ప్రతిష్టించారు. శుక్రవారం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ద్రౌపదీ కళ్యాణం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కళ్యాణాన్ని వేదపండితులు వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాయిద్యాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. దీంతో మొక్కులున్న భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు.